

అ'సమగ్ర' కొలువులు

- క్రమబద్ధీకరణకు నోచుకోని సమగ్ర శిక్ష ఉద్యోగులు
- సమ్మె చేసినా పరిష్కారం కాని సమస్యలు
- చాలీచాలని వేతనాలతో కుటుంబాల పోషణకు అవస్థలు
- ప్రభుత్వం హామీలు నిలబెట్టుకోవాలని డిమాండ్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు(ఫైల్)

ఆసిఫాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మాత్రం మారడం లేదని సమగ్ర శిక్ష ఉద్యో గులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం టైం స్కేల్ ఇస్తామని ప్రకటించి క్షీరాభి షేకాలు చేయిం చుకుని మోసం చేసిందని విమర్శి స్తున్నారు. అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ కూడా పట్టించు కోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిమాండ్ల సాధన కోసం గత డిసెంబరు 6వ తేదీ నుంచి జనవరి 7 వరకు సమ్మె కొనసాగించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల కల్పన కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో అమలుకావడంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత యూనిఫాం, మధ్యాహ్న భోజనం బియ్యం సరఫరా, ఉపాధ్యాయుల హాజరు నమోదు, ఆన్‌లైన్‌లో విద్యార్థుల నమోదు, బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించడం వంటి పనులను నిర్వహిస్తున్నారు. గురుకులాల్లో సీఆర్టీలు, పీజీ సీఆర్టీలు బోధన విధులు నిర్వహిస్తుండగా బోధనే తర సిబ్బంది తమకు కేటాయించిన విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రత్యేకాధికారులు కేజీబీవీల నిర్వా హణ బాధ్య తలను పర్యవేక్షిస్తున్నారు. అకౌం టెంట్లు, ఏఎన్ ఎంలు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, మండల స్థాయిలో సీఆర్పీలు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐఈఆర్పీలు, వ్యాయమ వొకేషనల్ ఉపాధ్యాయులు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, డే, నైట్ వాచ్‌మెన్‌లు, స్వీపర్లు, స్కావేం జర్లు, జిల్లా స్థాయిలో ఏపీవోలు, సిస్టం ఎనలిస్టులు, టెక్నికల్ పర్సన్‌లు, డీఎల్ఎంటీ మెస్సేంజర్లు, మోడల్ స్కూళ్లలో పనిచేసే వార్డెన్‌లు, ఆపరేటర్లు, కేర్ టేకర్లు కూడా సమగ్ర శిక్ష పరిధిలోకే వస్తారు.

● జిల్లాలో 440 మంది..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లావ్యాప్తంగా 440 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు ఉన్నారు. కేజీబీవీల్లో 347 మంది, సీఆర్పీలు 54, సీసీవోలు 10 మంది, ఎంఐఎస్‌సీవోలు 11, ఐఈఆర్పీలు 18 మంది పని చేస్తున్నారు. కలెక్టర్ రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపించే యూ డైస్, మధ్యాహ్న భోజన పథకం నివేదికల తయారీలో సమగ్ర శిక్ష ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. బియ్యం పంపిణీ, పాఠశాల బయట ఉన్న విద్యార్థులను గుర్తించడం వంటి పనులు ఈ ఉద్యోగులే నిర్వహిస్తుంటారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రాఫ్ట్, ఆర్ట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ బోధించే ప్రత్యేక ఉపాధ్యాయులు సమగ్ర శిక్ష పరిధిలోకి వస్తారు.

● సమ్మె విరమణ సమయంలో..

సమ్మె విరమణ సమయంలో పే స్కేల్ అమలు పై మూడు నెలల్లో మంత్రివర్గ ఉప సంఘ సమావేశం ఏర్పాటు చేస్తామని, ఆర్థికేతర సమస్య ల పరిష్కా రానికి వీలుగా ఉత్తర్వులు జారీ చేస్తా మని, సమ్మె కాలపు వేతనం అందజేస్తామ న్నారు. కానీ ఇచ్చిన హామీల్లో ఇంత వరకు ఒక్కటి కూడా ఇంత వరకు కార్యరూపం దాల్చలేదని ఉద్యోగులు మండిపడుతు న్నారు. తమ హక్కుల సాధన కోసం 15 ఏళ్లుగా వివిధ సందర్భాల్లో పోరాటాలు చేస్తూనే వచ్చారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరు వాత కూడా తమ సమస్యలను పట్టించుకో లేదు. డిమాండ్ల సాధనకు గత డిసెంబరు 6వ తేదీ నుంచి జనవరి 7వ తేదీ వరకు సమ్మె చేశారు.

● అరకొర వేతనాలతో..

సమగ్ర శిక్ష ఉద్యోగులు, సిబ్బంది చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. పెరుగుతున్న నిత్యావసరాలకు అనుగుణంగా వేత నాలు పెరగక వచ్చే వేతనంతో కుటుంబం పోషిం చుకోలేక ఇక్కట్లు పడుతున్నారు. రెగ్యులర్ ఉద్యోగు లతో సమానంగా విధులు నిర్వహిస్తున్న వచ్చే వేతనాలతో కనీస అవసరాలు తీర్చుకోలేక ఇబ్బం దులు పడుతూ మానసికంగా కుంగిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. పార్టు టైం ఉద్యోగులను ఫుల్ టైం ఉద్యోగులుగా గుర్తించి వేతనం పెంచాలని రెగ్యులర్ ఉద్యోగులుగా మారిది గానే సదుపాయాలు కల్పించాలని కోరుతు న్నారు. 61 సంవత్సరాలు నిండిన ఉద్యోగులకు 20 లక్షల రూపాయల రిటైర్‌మెంట్ బెని ఫిట్ చెల్లించాలని, మరణించిన ఉద్యోగుల కుటుంబా ల కు 15 లక్షల రూపాయల పరిహారం చెల్లించి ప్రతీ ఉద్యోగికి 10 లక్షల రూపాయల జీవిత బీమా, ఐదు లక్షల రూపాయల ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

హామీలు నిలబెట్టుకోవాలి...

- గెడేకార్ సంతోష్, సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ అధికార ప్రతినిధి



సమ్మె సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నిల బెట్టుకోవాలి. సమగ్ర శిక్షను పూర్తిస్థాయిలో విద్యాశాఖలో విలీనం చేసి ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలి. పేస్కేల్ అమలు కోసం మంత్రివర్గ ఉప సంఘం సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం ప్రకటించాలి. సమ్మె కాలపు వేతనాలు వెంటనే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

బీసీల రిజర్వేషన్లు తేలాకే ఎన్నికలకు వెళ్లాలి



జీవో 46 ప్రతులను దహనం చేస్తున్న బీసీ సంఘం నాయకులు

ఆసిఫాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తరువాతనే ఎన్నికలకు వెళ్లాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ రూప్‌నార్ రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జీవో నంబరు 46 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ సర్కార్ నమ్మించి మోసం చేసిందని మండి పడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను ఓట్లు వేసే మిషన్ లాగానే చూస్తున్నాయని చెప్పారు. బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా న్యాయం జరగడం లేదన్నారు. ఓట్లు మావి సీట్లు మీవంటే ఇకపై చెల్లదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో స్వతంత్రంగా బీసీలము పోటీ చేసి గెలుస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ డీసీసీ నియమకాల్లోనూ సైతం బీసీలకు మొండి చేయి చూపించిందని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒక్క బీసీని కూడా డీసీసీ పదవిలో నియమించక పోవడం బీసీలపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి ఎంటో కనబడుతుందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు బీసీలపై ప్రేమ ఉంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ తరువాతే ఎన్నికలకు వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ప్రణయ్, మారుతి, సాయికృష్ణ, విలాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని అభినందించిన మాజీ ఎమ్మెల్యే

బెజ్జూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన తొర్రెం ఏడుకొండలు ఇటీవల రెజ్లింగ్ టోర్నమెంట్‌లో ప్రతిభ చాటి బంగారు పతకం సాధించడంతో ఆది వారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అభినందించారు. ఒడిశా రాష్ట్రం లో మోడల్ ట్రైబల్ సొసైటీ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకున్నాడు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ఎస్ పరీక్ష

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం లోని జిల్లా పరిషత బాలుర బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్ఎస్) పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 221 మంది విద్యార్థులకు గాను 214 మంది విద్యార్థులు హాజర య్యారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశా లలో 229 మందికి గాను 223 మంది హాజరయ్యారు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సిర్పూర్(టి), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలుర పాఠశాలకు చెందిన 1997-98 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. అనంతరం తోటి మిత్రుడు టెంగ్రీ బాలాజీ మరణించడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బాలాజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.25 వేలు, స్కూల్ బ్యాగ్‌లు, నోట్ బుక్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో భక్తుల ప్రత్యేక పూజలు



నైవేద్యం సిద్ధం చేసిన భక్తులు

కాగజ్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఈసుగాం శివమల్లన్న ఆలయంలో ఆదివారం సట్టిబోనాలు సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సిర్పూరు నియోజ కవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఉదయం పూటనే శివాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా కొత్త పంటలతో వంటకా లు చేసి అనంతరం శివలింగం వద్ద పూజలు చేసి మొక్కులు తీ ర్చుకున్నారు. నైవేద్యం సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వ ర్యంలో భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

ఘనంగా ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలు

సిర్పూర్(టి), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలో ఆదివారం టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలను టీఆర్ఎస్ నాయ కులు ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకుల అస్లాంబీన్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి బోధనలు అనుసరించాలి



ఆసిఫాబాద్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న సత్యసాయిబాబా సేవా సదన్ సభ్యులు

ఆసిఫాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా బోధనలు ప్రతి ఒక్కరూ అనుసరించాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లో ఆదివారం సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలువురు బాబా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డేవిడ్ మాట్లాడుతూ సత్యసాయిబాబ చూపిన సేవ, ధర్మ మార్గం ఎల్లవేళలా అనుసరణీ యమని అన్నారు. మానవసేవే పరమావధిగా సేవా కార్యక్రమాలు చేపట్టి విశిష్ట స్థానం సంపాదించారని అన్నారు. ప్రేమ, అధ్యాత్మిక బోధనలతో ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది భక్తుల హృదల్లో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో పౌర సంబంధాల అధికారి సంపత్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గుండి రోడ్డులో గల సత్యసాయి సేవా సదనలో భక్తిశ్రద్ధలతో సత్యసాయి శత జయంత్యు త్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం, సాయంత్రం దీపాలంకరణ, కేక్ కట్ చేశారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించు కుని రెబ్బెన మండలం గోలేటిలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి ప్రత్యేక పూజ లు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్ర మం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి బాబా మేనేజ్‌మెంట్ సత్యనారాయణ, ఎస్వీ పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం బీబ్రా గ్రామంలో ఆదివారం సత్యసాయిబాబా జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా నగర సంగకీర్తన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేక్ కట్ చేసి భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబాసాగర్ గ్రామంలో ఆదివారం శ్రీ భగవాన్ సత్యసాయిబాబా జయంతిని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓంకారం, సుప్ర భాతం, నగర సంకీర్తన, పల్లకిసేవ, భజన, మంగళహారతి నిర్వహించారు. సత్యసాయిబాబా బోధనలు అనుసరించాలని అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం లో గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం



5కే రన్‌లో పాల్గొన్న ప్రవీణ్‌కుమార్, స్థానికులు

కాగజ్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుదామని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పట్టణంలో తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సిర్పూరు నియోజక వర్గం తనకు పునర్జన్మనిచ్చిందన్నారు. సిర్పూరు ప్రజల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తామన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం తన ప్రాణ త్యాగానికైనా సిద్ధమేనని అన్నారు. రాబోయే రోజుల్లో జరిగే ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ లెండుగురేశ్యాంరావు, అర్షద్ హుస్సేన్, కొంగసత్యనారాయణ, పెద్దపల్లి కిషన్ రావు, విశ్వనాథ్, సలీం, కాశిపాక రాజు, ముస్తాఫీజ్, మినాజ్, లలిత, కమల, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా కార్యకర్తలు, అభిమానులు నిర్వ హించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు.

ఫిట్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో

కాగజ్‌నగర్ పట్టణంలో 5కే రన్ కార్యక్రమం ఫిట్ ఇండియా ఫౌండే షన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీఎం క్రీడామైదా నం నుంచి ప్రారంభమైన 5కే రన్ కార్యక్రమం పట్టణంలోని లారీ చౌరస్తా ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా సర్‌సిల్క్ కాలనీ, ఎస్పీఎం క్రీడా మై దానం వరకు సాగింది. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అనారోగ్యం బారిన పడకుండా ఉండాలంటే తప్పకుండా వ్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో యువకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్వేరో సభ్యులు పాల్గొన్నారు.

అడవి పందుల దాడిలో పత్తి ధ్వంసం



ధ్వంసమైన పత్తి

వాంకిడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండ లంలో సాగు చేస్తున్న పంటలపై అడవి పం దులు దాడి చేస్తుండడం తో అన్నదా తలు ఆందోళ న చెందుతు న్నారు. . ప్ర తి రోజూ ఏదో ఒక రైతు చేనులో అడవి పందులు మూకుమ్మడిగా దాడి చేస్తూ పత్తి పంటను ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందు తున్నారు. పది రోజుల క్రితం మండలంలోని బెండార గ్రామానికి చెం దిన రైతు చేనులో దాదాపు రెండు ఎకరాలకు పైగా అడవి పందులు పత్తి పంటను ధ్వంసం చేశాయి. ఇటీవల స్థానిక ప్రజాప్రతినిధి పీఏసీఎస్ చేర్మన్ జాబిరే పెంటు చేనులో దాదాపు నాలుగు ఎకరాల పత్తి పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి. అధికారులు స్పం దించి పత్తి పంట నష్టంపై సర్వే నిర్వహించి పరిహారం అందించేంలా చూడాలని రైతులు కోరుతున్నారు.

కొండెక్కిన కోడిగుడ్డు ధర

- రిటైల్ మార్కెట్‌లో రూ. 8కు విక్రయం
- వినియోగదారుల బెంబేలు

బెజ్జూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కోడిగుడ్డు ధర కొండెక్కిది. రోజురోజుకూ ధర పెరిగిపోతుండడంతో నేటి రోజుల్లో ప్రజలు తమ ఆరోగ్యానికి బలం చేకూర్చే ఆహార పదార్థాలను వినియోగించడానికి ఆసక్తి చూపుతున్నారు. శరీరానికి అవసరమైన పోషకా లు రావడానికి గాను మాంసకృత్తులతో పాటు కోడిగుడ్లను వినియోగిస్తున్నారు. ఆర్థికంగా స్తోమత కలిగిన కుటుంబాల వారు వారం రోజులకు ఒకసారి మాంసహారం తీసుకుం టారు. ఇక సామాన్య కుటుంబాల వారు కోడిగుడ్లను వినియోగి స్తారు. అటువంటి సామాన్యుడికి అందుబా టులో ఉన్న కోడిగుడ్ల ధరలు అందకుండా పోతున్నాయి. గత కొద్ది రోజుల కిందట వరకు రిటైల్ మార్కెట్‌లో రూ.6ఉన్న ధర నేడు రూ.8కి చేరడంతో సామాన్యులకు భారంగా మారింది. కార్తీక మాసంలో హోల్‌సేల్ ధరలు 30గుడ్ల ట్రే ధర రూ.180ఉండగా, కార్తీక మాసం పూర్తయిన తర్వాత 30గుడ్ల ట్రే ధర రూ.200నుంచి రూ.201కి అమ్ముతున్నారు. దీంతో రిటైల్ కిరాణా వ్యాపారులు ఒక గుడ్డు ధర రూ.8కి అమ్ముతున్నారు. హైదరాబాద్ మార్కెట్‌లో కోడిగుడ్ల ధర రూ.630ఉండగా, హోల్‌సేల్ వ్యాపారుల కమీషన్, ట్రాన్స్‌పోర్ట్ చార్జీలతో కలిపి రూ.700లకు అమ్ముతున్నారు. దీంతో గత కొద్ది రోజుల కిందటి వరకు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్న కోడిగుడ్లు నేడు కొండెక్కి కూర్చుండటంతో తినడానికి వెనుకా డుతున్నారు. రానున్న రోజుల్లో కోడిగుడ్ల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని పౌల్ట్రీ వ్యాపారులు చెప్పడంతో ధరలు ఇప్పట్లో దిగివచ్చే అవకాశం లేదని వ్యాపారులు చర్చించుకుంటున్నారు.



ఉత్పత్తి తగ్గడం వల్లే..

గుడ్ల ఉత్పత్తి తగ్గడం వల్లే ధర పెరుగు తుందని ఫామ్‌రైతులు, హోల్‌సేల్ దుకాణా దారులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో ఉష్ణోగ్రతలు తగ్గడంతో చలి ప్రభావం పెరిగిం ది. సామాన్యంగా చలికాలంలో గుడ్లను అం దించే కోళ్లు చలి ప్రభావంతో గుడ్లు పెట్టడం తగ్గిస్తాయని దీంతో ఉత్పత్తి తగ్గడంతో గుడ్లకు డిమాండ్ ఏర్పడి ధరల పెరుగుదలకు కారణమైనట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇక చలి తీవ్రతకు ప్రజలు విరివిగా గుడ్లను వినియోగించడంతో కొరత ఏర్పడి గుడ్ల ధరలు పెరుగుతున్నాయి. చలి తీవ్రత ఇలాగే ఉంటే రానున్న రోజుల్లో గుడ్ల ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఇక గుడ్ల ధరలు రోజు రోజుకూ పెరుగుతుండటంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు భారంగా మారి తమకు గిట్టుబాటు కాదని వంట నిర్వాహకులు వా పోతున్నారు. ఒక్కో పాఠశాలలో వందల మంది విద్యార్థులు ఉంటే తాము ఎక్కడి నుంచి తీసుకురావాలంటూ వారు వాపోతున్నారు.

ఇందిరమ్మ గృహ ప్రవేశాలకు వేళాయే..



సిర్పూర్(టి)లో గృహ ప్రవేశానికి సిద్ధమైన ఇందిరమ్మ ఇల్లు

సిర్పూర్(టి), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పనులు పూర్తి చేసుకుని లబ్ధిదారులు గృహ ప్రవేశాలకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్మాత్మకంగా ఇళ్లు లేని నిరుపేదలకు రూ.5 లక్షలతో ఇంటి నిర్మాణాలు చేపట్టి పేదల సొంతింటి కల సాకారం చేస్తోంది. పథకంలో భాగంగా సిర్పూర్(టి) మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలోని 27 గ్రామాల్లో మొదటి విడత కింద మంజూరు అయిన 428 ఇళ్లు మంజూరు చేసింది. సిర్పూర్(టి) మేజర్ గ్రామ పంచాయతీలో 98 మంజూరు చేయగా మిగితావి అన్ని గ్రామ పంచాయతీలకు మంజూరు అయ్యాయి. కొందరు పూర్తి చేసి గృహ ప్రవేశానికి సిద్ధం చేసి ముహూర్తం ఖరారు చేసుకున్నారు. మొదట బేసిమెంట్ లేవల్‌కు లక్ష మంజూరు చేయగా పూర్తి నిర్మాణం అయిన వారికి రూ.4 లక్షల వారి ఖాతాల్లో జమయ్యాయి. మిగిలిన పది శాతం లబ్ధిదారులు నిర్మాణ దశలో ఉన్నారు. ఈ క్రమంలో మండలంలోని మారు ఊల అటవీ ప్రాంతం అయిన మేడ్‌పల్లి, రావన్‌పల్లి, లింబుగూడ గ్రామాల్లో రిజర్వు ఫారెస్టు కావడంతో అటవీ, రెవెన్యూ అధికారుల మధ్య స్థల వివాదం నెలకొన్నది. ఇరు శాఖల మధ్య నెలకొన్న సయోధ్యతో ఇటీవలనే పనులు ప్రారంభించారు. ప్రభుత్వం రూ.5 లక్షల ఇంటి నిర్మాణానికి నిధులు కేటాయించడంతో ఇళ్లు లేని నిరుపేదలు ఎంతో ఉత్సాహంగా పనులు పూర్తి చేసుకుంటున్నారు. మరికొంత మంది ఇళ్లు లేని నిరుపేదలు ప్రభుత్వం రెండో విడతలో మంజూరుకు వేచి చూస్తున్నారు.

త్వరగా ప్రారంభించుకోవాలి..

- సజియోద్దీన్, హౌసింగ్ ఏఈ

లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకుని ప్రారంభించుకోవాలి. ఇళ్లు సకాలంలో పూర్తి చేసుకున్నవారికి ప్రభుత్వం డబ్బులు ఖాతాల్లో వేస్తోంది. ఇంకా కొన్ని గ్రామాల్లో పనులు మొదలు పెట్టని వారికి అవగాహన కల్పిస్తు న్నాం. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 80 నుంచి 90 శాతం ఇళ్లు చివరి దశలో ఉన్నా యి. మండలంలో వంద శాతం ఇళ్లు పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నాం.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

రామకృష్ణాపూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రామకృష్ణ పూర్‌పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రి వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించారని, వీరిని తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి లభించిందన్నారు. రామకృష్ణపూర్‌కు చెందిన గంగాధరి పృథ్వితేజ, మంచిర్యాలకు చెందిన ఎస్‌కె గౌసియా వద్ద నుంచి 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరితో ఎవరికి సంబంధాలు ఉన్నాయని విచారణ చేస్తున్నామన్నారు. గౌసియా బల్లార్షా రైల్వేస్టేషన్ సమీపంలో తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇక్కడ పృథ్వితేజ అనే విద్యార్థి చేత ఎక్కువ ధరకు అమ్ముతుందన్నారు. గంజాయితో పాటు రూ. 1500 నగదును, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి రవాణా చేసినా, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, క్రమ శిక్షణతో చదువుకోవాల న్నారు. ఈ సమావేశంలో మందమర్రి ఎస్‌ఐ రాజశేఖర్, పోలీసులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంచుకోవాలి



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బొగ్గు ఉత్పత్తికి సంబంధించిన యంత్ర విడిభాగాలు అందుబాటులో ఉంచుకోవాలని శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. పర్చేజ్ విభాగంపై ఆదివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, యంత్రాలు సక్రమంగా పనిచేసేందుకు కెమికల్స్, విడిభాగాలు, సర్వీసింగ్ సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఫైళ్లు, టెండర్లు ఆలస్యం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. గనులు, విభాగాలలో పనిచేసే ఉద్యోగులకు స్వచ్ఛమైన తాగు నీరు అందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. వాటర్ ప్యూరిఫికేషన్ యంత్రాలు, వాటి పనితీరు, నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌ఓ టు జీఎం కుర్మ రాజేందర్, ఏజీఎం (ఫైనాన్స్) సుమలత, ఇందారం, శ్రీరాంపూర్ ఓసీపీల పీవోలు ఏ. వెంకటేశ్వర్‌రెడ్డి, సీహెచ్. వెంకటేశ్వర్లు, ఏజెంట్లు శ్రీధర్, రవికుమార్, డీజీఎంలు రాజన్న, మల్లయ్య, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, సీహెచ్‌పీ ఎస్‌ఈ చంద్రలింగం, ప్రాజెక్ట్ ఇంజనీర్ నాగరాజు, వివిధ గనుల మేనేజర్లు, గ్రూప్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికులపై పట్టింపు కరువు

శ్రీరాంపూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం రిటైర్డ్ కార్మికులను విస్మరిస్తోందని హెచ్‌ఎంస్ సింగరేణి విభాగం అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు వి. అనిల్ రెడ్డి, కార్యదర్శి పొనగంటి అశోక్ ఒక ప్రకటనలో ఆరోపించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థకు వచ్చిన లాభాల నుంచి రిటైర్డ్ కార్మికులకు ఇంతవరకు వాటా చెల్లించలేదన్నారు. దీపావళి బోనస్ కూడా ఇవ్వలేదన్నారు. ఎప్పుడు చెల్లిస్తారో కూడా ప్రకటించకపోవడం దారుణమన్నారు. సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంటే గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కూడా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. రిటైర్డ్ కార్మికులు సైతం తమ శ్రమను ధారపోసి నేటి సింగరేణిని నిర్మించారని గుర్తు చేశారు. వారికి చెల్లించాల్సిన వాటా, బోనస్‌లు వెంటనే ఇవ్వాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మంచిర్యాల క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం పాత మంచిర్యాల టి కన్వెన్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పూర్తి వివరాల ప్రకారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. నెన్నెల మండలం ఘన్‌పూర్‌కు చెందిన కుంబాల రాజేష్ భార్యమౌనిక, కూతురు ఆద్విక, కుమారుడు మదు వర్షిత్‌లు సీసీ కార్నర్‌లో ఉంటున్నారు. సింగరేణి పవర్ ప్లాంటులో వెహికల్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బైక్‌పై లక్షెట్టిపేటలో జరిగే ఓ వివాహానికి హాజరై తిరిగి వస్తున్న క్రమంలో హాజీపూర్ మండలం గుడిపేటకు చెందిన దుర్గం సంతోష్ అనే వ్యక్తి (సింగరేణి ఉద్యోగి) స్కూటీపై మంచిర్యాల నుంచి గుడిపేటకు వెళ్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో రాజేష్ బైక్ నుంచి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజేష్ పరిస్థితి విషమంగా ఉంది. కూతురు ఆద్వికకు మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ తరలించారు. ప్రమాదంలో దుర్గం సంతోష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సీఐ ప్రమోద్‌రావు క్షతగాత్రులను పరిశీలించారు. సంతోష్ మద్యం మత్తులో ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు.

- 60ఏళ్లు దాటిన వారికి లబ్ధి
- కిసాన్ మాన్‌ధన్ యోజనతో ప్రయోజనం
- అవగాహన లేక నీరుగారుతున్న పథకం



రైతుకు పెన్షన్

బెజ్జూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చిన్న, సన్నకారు రైతులకు వృద్ధాప్యంలో సామాజిక భద్రత కల్పించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కిసాన్ మానధన్ యోజన పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. 2019ఆగస్టు 9న ఈ పథకాన్ని ప్రారంభించినప్పటికీ అవగాహన లేక రైతుల దరికి చేరలేకపోతోంది. మంచి ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రవేశ పెట్టినా లక్ష్యం నీరుగారిపోతోంది. రైతులు వృద్ధాప్యంలోకి వచ్చిన తర్వాత ఆదాయ మార్గాలు ఉండవు. దీన్ని దృష్టిలో ఉంచుకొని 60ఏళ్లు దాటిన సన్న, చిన్నకారు రైతులకు ప్రయోజనం కల్పించాలని, ప్రతి నెలా జీవితాంతం రూ.3వేల చొప్పున పెన్షన్ అందించేలా పథకానికి రూపకల్పన చేశారు.

ఐదు ఎకరాల లోపు..

ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులవుతారు. 18నుంచి 40ఏళ్లు ఉన్న రైతులు అర్హులు. ఈమధ్య కాలంలో ఎప్పుడు రైతు పేరు నమోదు చేసుకున్నా పథకానికి అర్హత పొందుతారు. రైతు రూ.55నుంచి రూ.200వరకు ప్రీమియం రూపంలో నెల వారీగా బ్యాంకు ఖాతా ద్వారా చెల్లించాలి. రైతు రూ.55చెల్లిస్తే, కేంద్ర ప్రభుత్వం వాటాగా రూ.55కలిపి ప్రతి నెల జమ చేస్తారు. 20నుంచి 25ఏళ్ల వయసున్న రైతులు రూ.61చెల్లించాల్సి ఉంటుంది. 30ఏళ్ల వయస్సు వారు రూ.105, 40ఏళ్ల వారికి రూ.200చొప్పున ప్రీమియం చెల్లించాలి. 60 ఏళ్లు దాటిన తర్వాత రూ.3వేల చొప్పున రైతుకు పెన్షన్‌గా వస్తుంది. భర్త మరణిస్తే బార్యకు రూ.1,500 చొప్పున పెన్షన్ అందిస్తారు. కాగా క్షేత్రస్థాయిలో అధికారులు పథకాలపై రైతులకు అవగాహన కల్పిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు సూచిస్తు న్నారు. అర్హులైన రైతులు మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్, నామిని వివరాలు, రైతు సంతకంతో అప్‌లోడ్ చేస్తారు. కాగా ఈఎస్‌ఐ, ఈపీఎఫ్, నేషనల్ పెన్షన్ స్కీం, ఇన్‌కంటాక్స్ చెల్లింపువారులకు ఈ పథకం వర్తించదు.

అవగాహన కల్పిస్తున్నాం..

- నాగరాజు, వ్యవసాయ అధికారి, బెజ్జూరు

గ్రామాల్లో రైతువేదికల్లో 60ఏళ్లు దాటిన వారికి పెన్షన్ స్కీంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు తీసుకొని మేలు జరిగే లా చర్యలు తీసుకుంటాం. కిసాన్ మాన్‌ధన్ పథకం ద్వారా రైతులకు వృద్ధాప్యంలో ఆసరా ఉం టుంది. ప్రతీ రైతు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

పేకాట స్థావరంపై దాడి

భీమిని, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భీమిని మండల కేంద్రంలో ఆదివారం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం భీమిని గ్రామ సమీపంలో ఖాళీ స్థలంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే సమాచారం రావడంతో దాడి చేశారు. సంఘటనా స్థలంలో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తుల ను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 7,500 నగదు, 6 సెల్‌ఫోన్‌లు, ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నా రు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దేశీదారు పట్టివేత

కోటపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారుపెల్లి చెక్‌పోస్టు వద్ద ఆదివారం మహారాష్ట్ర నుంచి తెలంగాణ వైపు వస్తున్న 400 బాటిళ్ల దేశిదారు మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాజేందర్ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని సిరొంచ తాలూకా అమరాజి గ్రామానికి చెందిన సోదారి సంజీవ్ అనే వ్యక్తి దేశీదారు తీసుకువస్తుండగా తనిఖీ చేసి 400 బాటిళ్లు లభించాయని తెలిపారు. దీని విలువ సుమారు రూ. 24 వేలు ఉంటుం దన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఈ సందర్భంగా ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా..

● ఏళ్లు గడుస్తున్నా పట్టింపు కరువు ● రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు, ప్రయాణికులు



రోడ్డుపై ఏర్పడిన గుంతలు

జన్నారం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జన్నారం మండలంలోని బాదంపల్లి గ్రామానికి నిత్యం వందల సంఖ్యలో ప్రయా ణికులు వస్తూ పోతుంటారు. ముఖ్యంగా జన్నారం మండలంలోని బాదంపల్లి గోదావరి రేవుకు పుణ్యస్నానాలు ఆచరించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు, ప్రజలు అత్యధికంగా తరలిస్తుంటా రు. కాని బాదంపల్లి గ్రామానికి వెళ్లాలంటే రోడ్డుపై ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రయాణికులు బయపడే పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలోని గోదావరి తీరం వరకు సుమారు ఆరు కిలో మీటర్ల వరకు ఉటుంది. గ్రామం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అయితే నిత్యం రాకపోకలు సాగే గ్రామం కావడంతో అడుగ డుగున గుంతలు ఏర్పడి వాహనాలు నడపడమే గగనంగా మారింది. దీనికి తోడు రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు డిస్ట్రిబ్యూటరి పొలాలకు వెళ్లే కాలువ రోడ్డు పక్కన వంతెన వద్ద కోత కోయడంతో రోడ్డు పూర్తి స్థాయిలో దెబ్బతింది. దానికి పడ్డ గుంతను ప్రత్యామ్నాయంగా ఇసుక సంచులతో పూడ్చారే తప్ప మరమ్మతులు చేయడం మరిచారు. ఎప్పుడు గుంతలు ఏర్పడిన అప్పటికప్పుడు మరమ్మతులు చేస్తున్నామని చెబుతూ చేతులు దు లుపుకొని అటు అధికారులు, నాయకులు తప్పించుకుంటున్నారే త ప్ప అభివృద్ధి చేయడంలో విఫలమవుతున్నారు. గ్రామం నుంచి ఉదయం లేవగానే పాలతో మొదలయ్యే రాకపోకలు అర్ధరాత్రి వర కు కొనసాగుతాయి. ఏ రాత్రి ఏ గుంతలో ఎవరు పడుతారో అని స్థానికులు బయపడుతు న్నారు. ముఖ్యంగా వంతెన వద్ద ఏం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతు న్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు అధికారులు ఎప్పటికప్పుడు ప్రాంతాలను పరిశీలించి నప్పటికీ రోడ్డు వేయడం లో పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి పెద్ద పీట వేస్తుందని అటు నాయకులు చెబుతున్న ఈ గ్రామానికి రోడ్డు వేయడంలో ఎందుకు దృష్టి సారించడం లేదోనని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైన గోదవరి వరకు రోడ్డు నిర్మాణం జరుపాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన బాదంపల్లి రహదారి



అధికారులు రోడ్డు వేయాలి..

నాయకులు, అధికారు లు దృష్టి సారించి రోడ్డు వేయాలి. బాదంపల్లి గ్రామం జిల్లాలోనే ప్రతిష్టాత్మకమైన పేరుంది ఈ గ్రా మానికి జిల్లా నలుమూలల నుంచి పుణ్య స్నానాలు ఆచరించేం దుకు పెద్దఎత్తున భక్తులు తరలివస్తారు. గ్రామం అభివృద్ధి చెందా లంటే రోడ్డు అభివృద్ధి చెందాలి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- నందనకారి మ హేశ్, గ్రామస్థుడు



ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి..

బాదంపల్లి గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బం దులు లేకుండా చూ సేందుకు అధికారులు, నాయకులు పని చేయాలి. గ్రామానికి వెల్లే రోడ్డు బాగలేకపోవడంతో ఇబ్బందులకు గురవుతు న్నారు. గతంలో రోడ్డు నిర్మాణానికి వేసిన నివేదికను దృష్టిలో పెట్టుకొని రోడ్డు నిర్మాణం చేపట్టాలి

- ఎర్ర చంద్రశేఖర్, మాజీ జడ్పీటీసీ

వరికి మద్దతు ధర దక్కాలంటే..

» కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి

కౌటాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి వరి కోతలు మొదలయ్యాయి. ఇప్పుడిప్పుడే పంట చేతికొస్తోంది. ఇప్పటికే కొన్ని మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాగా మరో వారంలోగా అన్ని చోట్ల ప్రారంభం కానున్నాయి. ఆరుగాలం శ్రమించి వరి పంట పండించిన రైతులు తమ పంటకు ప్రభుత్వం మద్దతు ధర పొందాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించక తప్పదు.

ఇలా చేయాలి..

వరి గింజలన్నీ బంగారు రంగులోకి వచ్చిన తరువాతనే కోతలు ప్రారంభించాలి. వరి కోతకు ముందు పొలంలో ఉన్న కల్తీ మొక్కలను తీసి వేయాలి. కోతకు 15 నుంచి 20 రోజులు ముందే నీటి తడులు ఆపివేయాలి. 1010 రకం వరి గింజలు బంగారు రంగులోకి వచ్చే వరకు ఆగితే రాలి పోతాయి. ఈ ఒక్క రకాన్ని గోధమ రంగులోకి రాగానే కోయాలి. కోసిన వరి మొదళ్లను నాలుగు రోజుల పాటు బాగా ఎండనివ్వాలి. అనంతరం ఒక్కో రకం వరి వేర్వేరు కల్లాలు చేసి టార్పాలీన్‌లలో వరి మొదలు వేసి ట్రాక్టర్ల ద్వారా నూర్పిడి చేయాలి. ఒక రకానికి చెందిన వరి ధాన్యాన్ని మరో రకం వరి ధానయంతో కలపోద్దు. పొలం వద్దే సరైన గ్రేడింగ్ చేయాలి. గడ్డిని తీసి వేసి గింజలన్నీ కుప్పగా పోసి గాలి పంకల సహాయంతో (తాలు గింజలు) నాణ్యత లేని గింజలు లేకుండా శుభ్రంగా తూర్పారా పట్టాలి. ధాన్యంలో 17 శాతం లోపు తేమ ఉండే వరకు ఆరబెట్టి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు



తీసుకెళ్తే మద్దతు ధర వచ్చే అవకాశాలు ఉంటాయి. హార్వేస్టర్‌తో కోత ద్వారా మొదటి సారి పోస్తే డబ్బాను వేరుగా పోయాలి. ఆ తరువాత కోసినవన్నీ ఒక చోట పోయాలి. ఇలా చేయడం వల్ల కల్తీ ప్రమాదం తప్పుతుంది. వడ్లను సిమెంట్ కల్లాలు లేదా టార్పాలిన్ షీట్లపై ఆరబెట్టాలి. రెండు, మూడు రోజులుగా బాగా ఎండేలా కాళ్లతో కలియదున్నాలి. పంట కోశాక సరిగ్గా ఆరబెట్టక పోతే గింజలు రంగు మారి పంట నాణ్యత తగ్గుతుంది. పంటను ఆరబెట్టే సమయంలో రాళ్లు, మట్టి పెల్లలు, చెత్తాచెదారం వంటి వ్యర్థ పదార్థాలు చేరకుండా జాగ్రత్త వహించాలి. నిలువ చేసే పక్షంలో గోనే సంచులను కింద వేయకుండా కవర్లు పరిచి లేదా బల్లలపై బస్తాలు నెట్టుగా వేయాలి. పురుగులు ఆశించకుండా లీటరు నీటికి 5 ఎంఎల్ మలాథియాన్ మందును కలిపి బస్తాలపై పిచికారి చేయాలి. ఎలుకల నుంచి రక్షించుకోవడానికి బస్తాల మధ్య జింక్ పాస్పేట్ ట్యాబెలెట్లు ఉంచాలి. ఒక రోజు తలుపులు పూర్తిగా మూసి వేసి గాలి చొరబడకుండా జాగ్రత్త వహించాలి. ఇలా చేయడంతో ఎలుకలు లేకుండా పోతాయి. మరుసటి రోజు నుంచి తలుపులు తీయొచ్చు.

ఏ గ్రేడ్ రకం క్వింటాలుకు..

వరి ధాన్యం ఏ గ్రేడ్ రకం క్వింటాలుకు ప్రభుత్వం రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 మద్దతు ధర ప్రకటించింది. ఈ ధర దక్కాలంటే రైతులు ధాన్యంలో ఆణ్యత ప్రమాణాలు పాటించాలి. తేమ శాతం 17 శాతం లోబడి తాలు, ఒక శాతం మట్టి పెళ్లలు, రాళ్లు (ప్యాడైన రంగు, మారిన, మొలకెత్తిన, పురుగు తిన్న ధాన్యం, పూర్తి కాని, ముడుచుకు పోయిన ధాన్యం, తక్కువ రకం మిశ్రమం, ఆరు శాతం లోబడి) లేకుండా చేసుకోవాలి. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చేటప్పుడు రైతులు ఆధార్ కార్డు జిరాక్స్, భూమి పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, రైతుబంధుకు అనుసంధానమైన బ్యాంకు అకౌంట్ బుక్కు జిరాక్స్, ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నంబర్లను వెంట తెచ్చుకోవాలి. కౌలు రైతులు సైతం ఆధార్ కార్డు, బ్యాంకు పాసు బుక్కులు, కౌలు ఇచ్చిన రైతు పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్‌లతో పాటు ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నంబర్, ఆయా మండలాల వ్యవసాయాధికారులు జారీ చేసిన కౌలు సర్టిఫికెట్లను సమర్పించాల్సి ఉంటుంది.

హెచ్‌ఎంఎస్ చౌకబారు ప్రకటనలు మానుకోవాలి

శ్రీరాంపూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి ఎండి. రియాజ్ అహ్మద్ తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘంపై చౌకబారు ప్రకటనలు మానుకోవాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సమ్ము రాజయ్య హితవు పలికారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హెచ్‌ఎంఎస్ యూనియన్‌తో ఎన్నికలు, అటు తరువాత కూడా తమ సంఘం కలిసి పనిచేస్తోందన్నారు. కార్మిక హక్కుల కోసం తాము కలిసి ప్రయాణం చేసినా కృతజ్ఞత లేకుండా తమ సంఘంపై ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. టీబీజీకేఎస్‌కు గౌరవాధ్యక్షురాలిగా ఉన్న కవిత బంగారు బాతు లాంటి సింగరేణిని దోపిడీ చేసిందని ఆరోపించారు. ఇప్పుడు హెచ్‌ఎంఎస్ గౌరవాధ్యక్షురాలిగా మళ్లీ దోచుకునే ప్రయత్నంలో ఉందన్నారు. ఈ విషయం గమనించ కుండా ఆమెను గౌరవాధ్యరాలిగా నియమించుకొని హెచ్‌ఎంఎస్ చారిత్రక తప్పిదం చేసిందన్నారు. పైగా ఆమె పక్షాన వకాల్తా పుచ్చుకొని రియాజ్ అహ్మద్ మాట్లాడడం సమంజసం కాదన్నారు. తెలంగాణ ఉద్యమ సారధి ప్రొఫెసర్ కోదండరాంను చిన్నచూపు చూడడం సరికాదని తెలిపారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ నితికా పంత్

జైనూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ నితికా పంత్ అన్నారు. జైనూర్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ నితికా పంత్ ఆదివారం రాత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషనులో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్పీ పోలీసు సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో చట్ట వ్య తిరేక చర్యలు, అసాంఘిక కార్యకలాపాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై దృష్టి సారించాలని ఆదేశించారు. పోలీస్‌స్టేసన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ రమేశ్, ఎస్సై రవికుమార్, పోలీసులు పాల్గొన్నారు.

సింగరేణిలో క్రీడలకు పెద్దపీట

మందమర్రిటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉద్యోగుల, అధికారుల క్రీడలకు యాజమాన్యం పెద్దపీట వేస్తోందని సింగరేణి ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. రెండు రోజులుగా మందమర్రిలో నిర్వహిస్తున్న స్లోక్‌స్ట 2025 క్రీడల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరంతరం ఉత్పత్తిలో నిమగ్నమయ్యే ఉద్యోగులు, అధికారులు క్రీడలతో కొంత ఉపశమనం పొందుతారని చెప్పారు. ఆరోగ్యంగా కూడా ఉంటారని తెలిపారు. క్రీడల్లో రాణించే వారిని యాజమాన్యం ప్రోత్సహిస్తున్నదన్నారు. ఈ క్రీడలకు అన్ని ఏరియాల అధికారులు క్రీడల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. చాలా మంది అధికారులు వారెంచుకున్న క్రీడల్లో అద్భుతంగా రాణించారన్నారు. సింగరేణి సీఎండీ ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు క్రీడలకు చేయూతనందిస్తున్నారని తెలిపారు. అనంతరం గెలుపొందిన క్రీడా అధికారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు రఘుకుమార్, రాజేశ్వర్‌రెడ్డి, లలితేంద్రప్రసాద్, రాంబాబు, అబ్దుల్‌ఖాదిర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సింగరేణి ప్రాజెక్టు, ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్

చీరల పంపిణీలో ఆలస్యంపై మహిళల నిరసన

కాసిపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళ సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న ఇందిరమ్మ చీరల పంపిణీలో ఆలస్యాన్ని నిరసిస్తూ మహిళలు మల్కేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ఆదివారం రాత్రి ఆందోళనకు దిగారు. ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తామని సమాచారం ఇవ్వడంతో పనులు పోగొట్టుకుని పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చామని, ఇక్కడకు వచ్చిన తర్వాత చీరలు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, దీనిపై అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చీరల పంపిణీలో పారదర్శకత పాటించి సకాలంలో అందించాలని కోరారు.



నిరసన తెలియజేస్తున్న మహిళలు

చిన్న నీటి వనరుల గణన

- రెండు నెలల్లో లెక్కింపు ప్రక్రియ పూర్తి...
- డిజిటల్ యాప్‌లో వివరాల నమోదు...



చెరువు వివరాలను నమోదు చేస్తున్న చీఫ్ ప్లానింగ్ శాఖ అధికారులు

నస్పూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా చిన్న నీటి వనరులు చెరువులు, కుంటలు, బోర్లు బావులు, వ్యవసాయ బావుల గణన చీఫ్ ప్లానింగ్ శాఖ పర్యవేక్షణలో మొదలైంది. చిన్న నీటి వనరుల స్థితిగతులను పరిశీలించి వివరాలను నమోదు ప్రక్రియలో సర్వే యంత్రాంగం నిమగ్నమైంది. దేశ వ్యాప్తంగా ఐదేళ్లకు ఒక్కసారి చిన్న నీటి వనరుల సర్వే జరుగుతుంది. ప్రస్తుతం ఏడవ జాతీయ జల వనరుల గణన మంచిర్యాల జిల్లాలోని 18 మండలాల్లో కొనసాగుతోంది. చిన్న నీటి వ నరుల లెక్క తేలడంతో దాని ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిదులు కేటాయించే అవకా శం ఉంటుంది. జిల్లాలో వ్యవసాయ బావులు 9391, బోరు బావులు 11,014, చెరువులు, కుం టలు 3518, మొత్తం 23,923 ఉన్నాయి. వ్యవ సాయ రంగంలో బోరు బావులు, చెరువుల, కుం టలు, బావులతో పాటు పది హేను వందల హెక్టార్ల నుంచి రెండు వేల హెక్టార్ల వరకు సా గు నీ రందించే చిన్న నీటి వనరులను (మినీ ప్రాజెక్టులు) లెక్కిస్తారు. సర్వే కోసం అన్ని మండలాలు, మున్సి పాలిటీల్లో ఎన్యూమరేటర్లను నియమించి సిబ్బంది ద్వారా చెరువులు, కుంటలు, బావులు, బోరు బావులు ఎన్ని ఉన్నయనే లెక్కను తేల్చడంలో సిబ్బంది నిమగ్నమై య్యారు. 2017-18 సంవ త్సరంలో చేపట్టిన జల వనరుల లెక్కింపు ప్రక్రియను కాగితాల్లో (మ్యాన్యువల్) పొందు పర్చారు. కానీ ప్రస్తుతం నిర్వహిస్తున్న జల వన రుల సర్వేను ఎప్పటికప్పుడు డిజిటల్ పద్ధతి ద్వారా ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు.

జిల్లాలో 23,923 నీటి వనరులు...

మంచిర్యాల జిల్లాలోని 18 మండలాల్లో ఐదేళ్ల కిందట జరిపిన లెక్కల ప్రకారం 23,923 చిన్న నీటి వనరులున్నాయి. ప్రస్తుతం ని ర్వహిస్తున్న సర్వేతో గతంలో నిర్వహించిన సర్వేలో ఎన్ని ఉన్న యో, ప్రస్తుతం చేసే సర్వే లెక్కతో తేలిపోనుంది. తగ్గిపోయాయా, లేదా మరీ పెరిగాయా విషయం తెలిసిపోతుంది. జిల్లాలో ఈ నెల 17 నుంచి జల వనరుల గణన ప్రారంభమైంది. రెండు నెలల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేయాలనే లక్ష్యంతో చీఫ్ ప్లానింగ్ అధికారు లు ఆలోచ నలో ఉన్నారు. చీఫ్ ప్లానింగ్ ప్రత్యేక పర్యవేక్షణలో వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయితీ రాజ్, విద్యుత్, హార్టికల్చర్ తదితర శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సర్వేలో పాల్గొంటారు. గతంలో ఉన్న చిన్న నీటి వనరుల లెక్క ఆధారంగా ప్రస్తుతం ఉన్న వాటిని యాప్‌లో నమోదు చేస్తారు. ఏమైనా పని చేయకుండా ఉంటే వాటిని పని చేయని కింద లెక్కించి యాప్‌లో వివరాలు పొందుపర్చుతారు. గత లెక్కల ప్రకారం ఉన్న వాటికంటే ప్రస్తుతం కొన్ని తగ్గడంతో పాటు మరి కొన్ని పెరిగే అవకాశం ఉంటుంది. ఎంపిక చేసిన సిబ్బందికి సాంకేతిక పరంగా శిక్షణ ఇచ్చారు. జల వనరుల గణన ప్రక్రియ జిల్లాలో కొనసాగుతుందని, తొందరగానే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నమని చీఫ్ ప్లానింగ్ అధికారులు తెలిపారు.

జిల్లాలో 2017-18 లో నిర్వహించిన ఆరవ విడత జల వనరుల బోరు, వ్యవసాయ బావులు, చెరువులు, కుంటల లెక్క..

1. జన్నారం	-1988
2. దండేపల్లి	- 4235
3. లక్షెట్టిపేట	-1982
4. హాజీపూర్	-1269
5. కాసీపేట	- 623
6. తాండూరు	- 687
7. భీమిని	-417
8. కన్నెపల్లి	-992
9. వేమనపల్లి	-1180
10. నెన్నెల	- 801
11. బెల్లంపల్లి	-1052
12. మందమర్రి	-1149
13. మంచిర్యాల	-205
14. నస్పూర్	-243
15. జైపూర్	-1993
16. భీమారం	-824
17. చెన్నూరు	-2598
18. కోటపల్లి	-1683

దుప్పట్లు పంపిణీ

బెల్లంపల్లి, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టేషన్ రోడ్డులో గల సత్య సాయి బాబా దేవాలయం ప్రశాంతి నిలయంలో ఆదివారం సేవా సమితి సభ్యులు నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే సత్యసాయి బాబా శతజయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపిక

బెల్లంపల్లి, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన జాడీ శ్రేయాన్స్ జోనల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి అండర్-14 కరాటే పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ విజయ్‌సాగర్ తెలిపారు. ఎంపికైన విద్యార్థిని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి యాకూబ్ అభినందించారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గోపి, సీనియర్ అధ్యాపకులు దశరథం, కొండల్‌రావు, అల్లూరి వామన్, రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలను సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాల క్రైం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నూతన ఆవిష్కరణలను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. మంచిర్యాల కార్పోరేషన్‌పరిధిలోని సీసీసీ నస్పూర్ ఆక్స్‌ఫోర్డ్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మొత్తం 18 కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ ప్రదర్శనలో పాల్గొనే విద్యార్థులు ఉదయం 9 గంటల లోపు వేదిక వద్దకు గైడ్, ఉపాధ్యాయునితో, ప్రాజెక్టుతో హాజరు కావాలని తెలిపారు.

ఉమ్మడి ఆదిలాబాద్ వాలీబాల్ జట్ల ఎంపిక

మంచిర్యాల క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహిస్తున్నామని మైలారం శ్రీనివాస్ తెలిపారు. ఇక్కడ ఎంపికైన వారిని సిరిసిల్లలో ఈ నెల 29 నుంచి 2 వరకు జరగబోయే రాష్ట్ర స్థాయి జూనియర్ బాల బాలికల చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరుణాకర్, కబడ్డి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర పాల్ హాజరవుతారని తెలిపారు.

జాతీయ బాట్మింటన్ పోటీలకు..

మంచిర్యాల క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బీహార్‌లో జరిగే అండర్ 13 బ్యాట్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలకు మంచిర్యాలకు చెందిన కందికట్ల సహస్ర ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బ్యాట్మింటన్ అసోసియేష న్ అధ్యక్షులు ముఖేష్ గౌడ్, కార్యదర్శి పుల్లూరి సుధాకర్, మీనారెడ్డి రమేష్‌లు అభినందించారు. తల్లిదండ్రులు మధు కుమార్ శ్రవంతి ప్రోత్సాహంతో ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కోచ్ వికాస్ హర్షకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇందిరమ్మ చీరల పంపిణీ

మందమర్రిరూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చిర్రకుంట, అందుగులపేట గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ నాయకులు గందె రాంచందర్, కడారి జీవన్‌కుమార్‌లు ఇందిరమ్మ చీరలను మహిళలకు పంపిణీ చేశారు. నాయకులు ఒడ్నాల కొమురయ్య, ఐకేపీ సీసీ చారి, వీవోఏలు పద్మ, సంధ్య, లబ్దిదారులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జయంతి

లక్షెట్టిపేట, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో లక్షెట్టిపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దివంగత చుంచు లక్ష్మయ్య జయంతిని ఆదివారం బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ నేత అప్పటి మన లక్షెట్టిపేట నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా బీసీల ఐఖ్యత కోసం ఎంతో కృషి చేసిన నాయకుడు లక్ష్మయ్య అన్నారు. లక్షెట్టిపేటలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. మాజీ జడ్పీటీసీ చుంచు చిన్నయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుపతి, లచ్చన్న, రాజన్న, చందు, రమణచారి, లచ్చన్న, పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ స్టేట్ లెవెల్ టోర్నమెంట్‌లో విద్యార్థుల ప్రతిభ

హాజీపూర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 22, 23 తేదీల్లో వరంగల్‌లోని నెల్లికుదురులో జరిగిన ఎస్జీఎఫ్ స్టేట్ లెవెల్ టోర్నమెంట్‌లో మహాత్మ జ్యోతిబాపూలే బాలుర విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ షేరు శ్రీధర్ తెలిపారు. అండర్ 17 విభాగంలో ఏ.భానుతేజ స్వర్ణ పతకం, బి వెంకటరమణ రజిత పతకం, శ్రీ హర్షిత్ వర్మ బ్రాంజ్ మెడల్ సాధించారు. అండర్ 14 విభాగంలో ఎస్కే. అమన్, ఉదయ్ కిరణ్, స్నేహిత్, జి.అరవింద్‌లు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, పీడీ సురేష్, పీఈటీ నగష్, విద్యార్థులను అభినందించారు.

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్

భీమారం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలు కావాలని ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకున్నారని, దానికి విరుద్ధంగా కేసీఆర్ ప్రభుత్వం నడిస్తే బుద్ధి చెప్పారని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సైతం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు మహేష్‌వర్మ అన్నారు. మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో ఆదివారం పార్టీ ముఖ్య నేతల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ యూత్ అధ్యక్షుడు దీపక్, మహిళ అధ్యక్షురాలు లావణ్య మాట్లాడుతూ మండలంలో పార్టీ జెండా ఎగరాలని, ఇందుకు కావాల్సిన ముందస్తు కసరత్తును ఏర్పాటు చేశామన్నారు. పార్టీని బలోపేతం చేయడానికి నాయకులు కృషి చేయాలన్నారు. అనంతరం పార్టీ అధ్యక్షుడిగా దెబ్బట శంకర్, ప్రధాన కార్యదర్శిగా తగరం రాజ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధునయ్య, వెంకటస్వామి,మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు దేశభక్తి పెంపొందించుకోవాలి



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీసీ శిక్షణతో ప్రతి ఒక్కరికి దేశ భక్తి పెంపొందుతుందని సీవీ రామన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గడిపెల్లి నర్సయ్య పేర్కొన్నారు. ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాలలోని సీవీ రామన్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ కేడెట్ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణతో దేహదారుడ్యంతో పాటు క్రమ శిక్షణ అలవడుతుందని, ఆర్మీ, నేవీ, త్రివిధ దళాల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సైతం అధికంగా వచ్చే అవకాశాలుంటాయన్నారు. ప్రతి ఒక్కరు దేశంపై మక్కువతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ కేవీ ప్రతాప్, ఎన్‌సీసీ ఏఎన్‌వో ప్రశాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం మంచిర్యాల నుంచి శబరిమల వరకు ప్రత్యేక రైలును ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ వినతి పత్రం అందించారు. శబరిమలకు ప్రత్యేక రైలును మంచిర్యాల నుంచి ఏర్పాటు చేస్తే కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి ప్రాంతాల నుంచి శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. స్పందించిన కిషన్‌రెడ్డి సౌత్ సెంట్రల్ రైల్వే జీఎంతో మాట్లాడి ప్రత్యేక రైలు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు రఘునాథ్ తెలిపారు.

పురగిరి క్షత్రియ పెరిక సంఘం ఎన్నిక

హాజీపూర్, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి) : గుడిపేట గ్రామంలో ఆదివారం పురగిరి క్షత్రియ పెరిక సంఘం కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులు లగిశెట్టి రాజయ్య, దొమ్మటి లచయ్య ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో లగిశెట్టి కమలాకర్‌ను సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కందుల వెంకటేశ్వర్లు, లగిశెట్టి మొగిలి, బోడకుంటి మల్లేష్ ప్రధాన కార్యదర్శిగా కందుల రమేష్, కోశాధికా రిగా దొమ్మటి రాజేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు



చెన్నూర్‌లో సత్యసాయి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

చెన్నూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సత్యసాయి బాబా ఆలయంలో ఆదివారం బాబా శతజయంతి వేడుకలను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో సత్యసాయి శోభాయాత్రను నిర్వహించారు. మహిళలు కోలాటాలు ఆడుతూ నృత్యాలు చేశారు. ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు. సత్యసాయి సేవా సమితి నిర్వహకులు భక్తులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీభగవాన్ సత్యసాయి బాబా వందవ జయంతిని సభ్యులు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సభ్యులు భక్తులు మహిళలు పట్టణంలో భజన గీతాలతో నగర సంకీర్తన చేసారు. అనంతరం సత్యసాయి సేవా సుధా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులక పండ్లు బ్రెడ్ పంపిణీ చేసారు. స్థానిక కన్యక పరమేశ్వరి ఆలయంలో దీన నారాయణులకు అమృత కలుశాలను అందజేసిన అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, నారాయణ సేవా కార్యక్రమం నిర్వహించారు. సంస్థ సభ్యులు గంప రవీందర్, రమేష్, నగధర్, శ్రీనివాస్, మురళి, సుధాకర్, లింగమూర్తి పాల్గొన్నారు.

దండేపల్లి: దండేపల్లిలో జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున సత్యసాయి చిత్రపటంతో స్వామి నగర సంకీర్తణ చేపట్టారు. శ్రీసతారామాంజనేయస్వామి ఆలయంలో స్వామి పాదుకాపూజ, అష్టోత్తర శతనా మావళి, రాత్రి వేళ స్వామి వారి జన్మదిన సందర్భంగా ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి నిర్వహకులు పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని కోమటిచేను లోని రాంసాయిమందిర్‌లో రెండు రోజులుగా జరుగుతున్న సత్యసాయి శత జయంతి వేడుకలు ఆదివారం ముగిశాయి. నగర సంకీర్తన, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం నిరుపేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాపూర్, కొండాపూర్, కోమటిచేను, కాసిపేట భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

నెన్నెల: నెన్నెలలో ఉదయం ఓంకార సుప్రభాతం, నగర సంకీర్తనతో ప్రారంభ మైన వేడుకలు రాత్రి వరకు కొనసాగాయి. స్థానిక గంగాధర దేవాలయ ఆవరణలో భజన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాల వికాస్ చిన్నారుల సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి ప్రత్యేక భజన, ఊయల సేవలో వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు. వేడుకల్లో సత్య సాయి సేవా సమితి మండల కన్వీనర్ సేని వెంకన్న, సభ్యులు శ్రీనివాస్, రాజన్న, శంకరయ్య తొమ్మిది గ్రామాల అనుబంద భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

ఫార్మాసిస్ట్ పరీక్ష ఫలితాలెప్పుడో..?

(5వ పేజీ తరువాయి)

కల్పించిన వెయిటేజీని రద్దు చేయాలనే డిమాండ్లు తెరపైకి వచ్చాయి. ప్రభుత్వంలో ఏకకాలంలో రెండు చోట్ల పనిచేయడం సర్వీస్ నిబంధనలకు విరుద్ధం. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు రావడంతో వైద్య ఆరోగ్యశాఖ విచారణ చేపట్టింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తూ, అదే సమయంలో ప్రైవేటు మెడికల్ షాపుల్లో రిజిస్టరైన ఫార్మాసిస్టుల వివరాలు సేకరించింది. ఇలా రెండు చోట్లా ప్ర యోజనం పొందడాన్ని కొందరు అభ్యర్థులు సవాల్ చేస్తూ హై కోర్టును ఆశ్రయించారు. రెండు చోట్లా ప్రయో జనం పొందుతున్న వారిలో పరీక్షకు హాజరైన అభ్యర్థులు రాష్ట్ర వ్యాప్తంగా 900కు పైగా ఉన్నట్లు గుర్తించగా, జిల్లాలోనూ పదుల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది.

అద్దెకు సర్టిఫికెట్లు..

మెడికల్ షాపుల్లో డిప్లొమా, బీ ఫార్మసీ పూర్తి చేసిన వారు ఉండాలనే నిబంధన ఉంది. వారికి తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ అర్హత సర్టిఫికెట్లు ప్రదానం చేస్తుంది. అప్పుడే వారికి మెడికల్ షాపులు నిర్వహించేందుకు అర్హత లభిస్తుంది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా 90 శాతం మెడికల్ షాపుల్లో అర్హతగల నిర్వాహకులు లేరు. ఈ విషయం వైద్య ఆరోగ్యశాఖ అధికారుల విచారణలోనే తే లింది. దీంతో మెడికల్ షాపుల్లో అద్దెకు తీసుకున్న సర్టిఫికేట్ల ఆధారంగా మందులు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫార్మాసిస్టులుగా కొనసాగుతున్న వారిలో అనేక మంది తమ సర్టిఫికేట్లను ప్రైవేటు మెడికల్ షాపులకు అద్దెకు ఇచ్చినట్లు విచారణలో తేలింది. ఇందుకుగాను సర్టిఫికేట్ అద్దెకు ఇచ్చిన వారు వేతనం రూపంలో మెడికల్ షాపుల నుంచి లబ్ది పొందుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఇలా ఫార్మాసిస్టుగా ఉద్యోగం చేస్తూ, సర్టిఫికేట్లు అద్దెకు ఇచ్చిన వారికి వెయిటేజీ ఇవ్వడం పట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతుండగా, ఈ విషయమై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవలసి ఉంది. ఇదిలా ఉండగా, ఇటీవల తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన ఇదే తరహా ఫార్మసిస్ట్ నోటిఫికేషన్‌లో 100 మార్కులకు కనీస అర్హత మార్కులు పెట్టి, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సేవలు అందించిన వారికి కేవలం 5 శాతం వెయిటేజీ ఇచ్చింది. తెలంగాణలో సైతం రాత పరీ క్షకు కనీస మార్కులు కేటాయిస్తూ, అదే తరహాలో వెయిటేజీని తగ్గించడం ద్వారా మెరిట్ అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే అభ్యర్థనలు వినిపిస్తున్నాయి.

సర్పంచు రిజర్వేషన్లు ఖరారు

జైపూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సర్పంచు ఎన్ని కలకు సంబంధించి గ్రామపంచాయతీలకు రిజర్వేషన్‌లు ఖరారు చేశారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీలకు గాను 10 గ్రామపంచాయతీలకు జనరల్ స్థానాలు, షెడ్యూల్డు తెగలకు 1, బలహీన వర్గాలకు వారికి 1 చొప్పున రిజర్వు చేశారు. మిగితా 10 గ్రామపంచాయతీల్లో షెడ్యూలు కులాలకు కేటాయిస్తూ రిజర్వేషన్‌లను ఖరారు చేశారు. బెజ్జాల, గంగిపెల్లి ఎస్సీ మహిళ, ఎల్కంటి, ఇందారంకు జనరల్, జైపూర్‌కు షెడ్యూల్ తెగ, కాన్కూర్‌కు జనరల్ మహిళ, కిష్టాపూర్‌కు ఎస్సీ జనరల్, కుందారం ఎస్సీ మహిళ, మి ట్టపల్లికి జనరల్, ముదిగుంటకు జనరల్ మహిళ, నర్సింగాపూర్‌కు ఎస్సీ జనరల్, నర్వకు జనరల్ మహిళ, రామారావుపేటకు ఎస్సీ జనరల్, శెట్‌పల్లికి ఎస్సీ మహిళ, శివ్వారంకు బీసీ జనరల్, టేకు మట్లకు జనరల్‌కు, వేలాలకు జనరల్ మహిళ, వెంకట్రావుపల్లికి జనరల్‌ను కేటాయిస్తూ రిజర్వేషన్‌లను ఖరారు చేశారు.

కోటపల్లిలో..

కోటపల్లి : కోటపల్లి మండలంలో 31 గ్రామపంచాయతీల రిజర్వేషన్ స్థానాలను అధికారులు ప్రకటించారు. ఇందులో బబ్బెరచెలక, కోటపల్లి, నాగంపేట, నక్కలపల్లి, పంగిడి సోమారం, రాజారాం, రొయ్యలపల్లి, సూపాక పంచాయతీలు జనరల్‌కు కేటాయించారు. అలాగే ఆల్గామ, దేవులవాడ, జనగామ, కొండంపేట, లక్ష్మీపూర్, సిర్సా వెల్మపల్లి, వెంచపల్లి పంచాయతీలను జనరల్ మహిళకు కేటాయించారు. పారుపెల్లి, పిన్నారం, పుల్లగామ, రాంపూర్, శెట్‌పల్లి, రాపన్‌పల్లి పంచాయతీలను ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. పొన్నారం, ఎడగట్ట, ఎసన్‌వాయి, కొల్లూరు, లింగ న్నపేట, మల్లంపేట పంచాయతీలను ఎస్సీ మహిళకు కేటాయించారు. సర్వాయిపేట, ఏదులబంధం పంచాయతీలను ఎస్టీ జనరల్‌కు, బొప్పారం పంచాయతీని ఎస్టీ మహిళకు కేటాయించారు.

దాడికి పాల్పడిన వారిపై కేసు

మంచిర్యాల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణం వెంకటేశ్వర థియేటర్ సమీపంలో పార్కింగ్ విషయంలో జరిగిన గొడవలో దాడికి పాల్పడిన సంజీవ్‌పై కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు. నాడెం సందీప్ కుమార్ బైక్ పార్క్ చేస్తున్న క్రమంలో ఇరువురికి ఘర్షణ పెరగడంతో సంజీవ్ అతడి అనుచరులు సందీప్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడిర ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

46 జీవోను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి

భీమారం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 46 జీవోను వెంటనే రద్దు చేయాలని బీసీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం భీమారంలో జీవో కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో 60 శాతం పైగా బీసీ జనాభా ఉన్నారని, బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేష న్లు అమలు చేస్తామని జీవో నెంబరు 9ని విడుదల చేసి దీని అ మలుకు కృషి చేయకుండా జీవోను రద్దు చేసి బీసీ రిజర్వేషన్‌లను 22 శాతానికి పరిమితం చేస్తూ 46 జీవోను తీసుకువచ్చి బీసీలకు రాజకీయంగా అన్యాయం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లును ఆమోదించి ఉంటే బీసీలకు పెద్ద ఎత్తున రిజర్వేషన్‌లు అమలయ్యేవన్నారు. చెన్నూరు నియోజకవర్గంలో 101 గ్రామపంచాయతీలకు కేవలం మూడు బీసీలకు కేటాయించారని, భీమారం మండలంలో 11 గ్రామ పంచాయతీలకు ఒక్క పంచాయతీని మాత్రమే బీసీకి కేటాయించారన్నారు. వెంటనే బీసీ రిజర్వేషన్‌లను అమలు చేయాలన్నారు. నాయకులు శ్రీకాంత్, తిరుపతి, శ్రీనివాస్, రమేష్, లచ్చన్న పాల్గొన్నారు.

కోటపల్లిలో బీసీలకు అన్యాయం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కోటపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సర్పంచు రిజర్వేషన్‌లలో కోటపల్లి మండలంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీజేపీ మండల అధ్యక్షుడు పెద్దింటి స్వప్నపున్నంచంద్, మంత్రి రామయ్యలు విమర్శించారు. ఆదివారం సిర్సా గ్రామంలో వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో ఒక్క బీసీ రిజర్వేషన్ లేదని, బీసీలకు 42 శాతం వాటా ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క పంచాయతీని కూడా బీసీలకు కేటాయించకపోవడం అత్యంత దారుణమన్నారు. బీసీలపై ప్రభుత్వం అణిచివేత ధోరణి ప్రదర్శిస్తుందని, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం లోపు కేటాయించి మిగితా అన్ని పంచాయతీలు జనరల్ కింద పెట్టడం వల్ల బీసీలకు చోటు ఎక్కడ అని వారు ప్రశ్నించారు. రెండు నెలల క్రితం ప్రకటించి రద్దు చేసిన రిజర్వేషన్‌లలో బీసీలకు కేటాయించిన 12 సర్పంచు స్థానాలను ఈసారి జనరల్ కోటాలోకి మార్చడం దుర్మార్గమన్నారు. రిజర్వేషన్‌ల కేటాయింపునకు బాధ్యత వహించిన డిలిమిటేషన్ కమిటీ తమ నిర్ణయాలపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ



భీమినిలో చీరలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భీమిని, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళల ఆత్మగౌరవం నిలిపేలా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తుందని కాంగ్రెస్ భీమిని మండల అధ్యక్షుడు గాదం లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం భీమిని మండల కేంద్రంలో మహిళలకు చీరలు పంపిణీ చేసి మాట్లాడారు. మహిళల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. మాజీ సర్పంచు ఇందూరి భూమయ్య, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కోటపల్లి : మండలంలోని శెట్‌పల్లి, సర్వాయిపేట, జనగామ, రాంపూర్, నాగంపేట తదితర గ్రామాల్లో ఆదివారం ఐకేపీ సంఘాల మహిళలకు ఆ శాఖ సిబ్బంది, గ్రామైక్య సంఘాల నాయకులు చీరలను పంపిణీ చేశారు. ఐకేపీ సీసీలు జేక సునీత, రాజ మల్లగౌడ్ పాల్గొన్నారు.


లక్షెట్టిపేట: పట్టణంలోని ఐకేపీ ఆధ్వర్యంలో మహిళ సంఘాల మహిళలకు తహసీల్దార్ దిలీప్ కుమార్ చేతుల మీదుగా ఆదివారం మహిళ లకు చీరలు అందజేసారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆరీఫ్, ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్. పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

కాసిపేట : కాసిపేటలోని ఐకేపీ కార్యాలయంలో ఆదివారం ఇందిర మహిళ శక్తి చీరలను మండల స్పెషల్ ఆఫీసర్ పురుషోత్తంనాయక్ మహిళలకు పంపిణీ చేశారు. ఏపీఎం రాజ్‌కుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి, సీసీలు, సీఏవోలు పాల్గొన్నారు.

నెన్నెల : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మహమ్మద్ అబ్దుల్ హై అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, ఏపీఎం త్రయంబకేశ్వర్, ఎంఎస్ అధ్యక్షురాలు అమృత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

కాళీమాత ఆలయంలో పూజలు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సర్వజననీ కాళిమాత అనుగ్రహంతో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు, ఆదిలాబాద్ డీఎస్పీ రఘునాథ్ చౌహాన్‌లు ఆకాంక్షించారు. ఆదివారం మంచిర్యాలలోని గాంధీనగర్‌లో కాళిమాత ఆలయాన్ని అత్యంత వైభవోపేతంగా ప్రారంభించారు. అఘోరాలు పాల్గొని ప్రత్యేక పూజలు, వైదిక పండితులు యజ్ఞాలు నిర్వహించారు. మంచిర్యాల ఆర్డీవో, పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నల్ల శంకర్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంక టేశ్వర్లు, ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి దెబ్బట తిరుపతి, తిరుపతి, విజయ, పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



ఘనంగా గీతా ధ్యాన సప్తాహము

శ్రీరాంపూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) :శ్రీమద్భవద్వీత సత్సంగం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో క్రిష్ణకాలనీ, ఆర్కే 6 కాలనీ శివాలయం ప్రాంగణంలో శ్రీ గీతా ప్రశాంతి నిలయంలో 27వ వార్షికోత్సవాలను ప్రారంభించారు. విశేష కార్యక్రమాలు ప్రారంభ మయ్యాయి. ఆదివారం ఉదయం 6 గంటలకు జెండావిష్కరణ, కలశ స్థాపన, 58వ గీతా ధ్యాన సప్తాహము, గణపతి, నవగ్రహాలు, శ్రీ కృష్ణుని అభిషేకం నిర్వహించారు. ఈ నెల 30న స్త్రీమూర్తులతో కుంకుమ పూజలు, వచ్చేల నెల 1న గీతా హవన యజ్ఞం, పాఠశాలల విద్యార్థులతో సంపూర్ణ గీతా పారాయణం, వెయ్యి మంది భక్తులతో గీతా పారాయణం ఉంటుందన్నారు. దాసరి భక్త రాజేశం గూరూజీ ఆధ్వర్యంలో వారం పాటు గీతా సప్తాహము, ఆధ్యాత్మిక ఉపన్యా సం, యోగా, కోలాటం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ముందుగా ఆయా కార్యక్రమాలకు సంబం ధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. కన్వీనర్ డి డి ప్రసాద్, సభ్యులు రాజమౌళి, ఆర్.మల్లేష్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

జన్నారం, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవునిగూడ గ్రామానికి చెందిన పోకల తిరుపతి ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో తన చిన్ననాటి స్నేహితులంతా కలిసి ఆదివారం 15వేల ఆర్థిక సాయాన్ని తన కుటుంబానిక ఆర్థికసాయం అందజేశారు. రవి, మొగిలి, సుభాష్, భూమన్న, క్రిష్ణ, సురేందర్, పాల్గొన్నారు

జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల కమిటీ ఎన్నిక

మంచిర్యాల క్రైం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల జిల్లా కార్యవర్గాన్ని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు శ్రీహరి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఉప్పులేటి శంకర్, తాండూర్ ప్రధాన కార్యదర్శిగా రాంచందర్, కోశాధికారిగా రాజశేఖర్‌లతో పాటు గౌరవ అధ్యక్షులుగా కనకరాజు, కొమురయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్, వినోద్ కుమార్, సంధ్య, సెక్రెటరీలుగా వసుధ, అఫ్రోజ్‌లను ఎన్నుకున్నారు.

- గతేడాది నవంబరులో కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్ నిర్వహణ
- ఇప్పటి వరకు విడుదలకాని ప్రొవిజినల్ లిస్టు
- జిల్లా వ్యాప్తంగా వంద మంది అభ్యర్థుల ఎదురు చూపు
- కనీస అర్హత మార్కులు లేకపోవడంపై అభ్యంతరం
- నేరుగా వెయిటేజీ ఇవ్వడంతో అర్హులకు అన్యాయం

ఫార్మాసిస్ట్ ఫలితాలెప్పుడో?



మంచిర్యాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిస్ట్ గ్రేడ్-2 ఉద్యోగ నియామకాల పరీక్షకు సంబంధించి ప్రభుత్వం ఫలితాలు ఎప్పుడు విడుదల చేస్తుందోనని అభ్యర్థులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఫార్మాసిస్ట్-2 ఉద్యోగ నియామక ప్రక్రియలో కొందరు అభ్యర్థులకు 'ద్వంద్వ ప్రయోజనాలు' చేకూరుతుండటం వివాదానికి దారితీ సింది. ఈ విషయంలో కొందరు కోర్టును ఆశ్రయించడంతో ప్రొవిజినల్ లిస్టు విడుదలకు మోక్షం కలగడం లేదు. చాలా ఏళ్ల తరువాత ప్రభుత్వం ఫార్మాసిస్టు గ్రేడ్-2 ఉద్యోగ నియామకాల కోసం గత ఏడాది సెప్టెంబర్ 24న 732 పోస్టులతో కూడిన భారీ నోటిఫికేషన్ జారీ చేసింది. అదే ఏడాది నవంబరు 31న కంప్యూటర్ బేస్డ్ పరీక్ష నిర్వహించగా, రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 27వేల మంది అభ్యర్థులు హాజరయ్యారు. అయితే ప్రశ్నపత్రాల మూల్యాంకనం పూర్తయినప్పటికీ ఏళ్ల గ డుస్తున్నా ప్రొవిజినల్ లిస్టు విడుదల చేయడంలో జా ప్యంపై అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆ పరీక్షకు జిల్లా నుంచి దాదాపు వంద మంది వరకు హాజరయ్యారు.

● వివాదానికి దారితీసిన 20 శాతం వెయిటేజీ...

ఫార్మాసిస్ట్ గ్రేడ్-2 కంప్యూటర్ ఆధారిత పరీక్షకు ఫార్మసీ ప్రాక్టీస్ రెగ్యులేషన్స్ -2015 అనుబంధం-3 ప్రకారం డిప్లొమా, బీ ఫార్మసీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు. అయితే పరీక్షకు హాజరయ్యేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్‌లో ఎటువంటి శిక్షణ, అనుభవాన్ని సూచించ కపోగా, పాలసీ నిర్ణయం పేరిట కాంట్రాక్ట్, ఔట్ సో ర్సింగ్ ఫార్మా సిస్ట్‌లకు గరిష్ఠంగా 20 మార్కులు అదనం గా వెయిటేజీ జతపరచడం వివాదానికి దారి తీసింది. మిగిలిన 80 శాతం రాత పరీక్షకు కనీస అర్హత మా ర్కులు పెట్టకుండా నేరుగా వెయిటేజీ చేర్చడం గమ నార్హం. ఈ విధానంలో పరీక్షలో సాధించిన మార్కులతో పనిలేకుండానే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఫార్మాసిస్ట్‌లు నేరుగా ఉద్యోగానికి ఎంపిక అయ్యే అవకాశాలు అధికం గా ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం వెయిటేజీ కల్పించడం వల్ల అన్ని అర్హతలు గలిగి ఉండి, 80 మార్కుల పరీక్షలో అత్యధిక మార్కులు పొందిన వారి కి ఉద్యోగం వస్తుందన్న గ్యారెంటీ లేదు. 80 మార్కుల రాత పరీక్షలో జిల్లాకు చెందిన పలువురు 60 శాతానికి పైగా మార్కులు సా ధించగా, వెయిటేజీ లేని కారణంగా వారికి ఉద్యోగ అవ కాశాలు లభించే పరిస్థితులు కనిపించడంలేదు. దీంతో రాత పరీక్షలో ఉన్నత మార్కులు సాధించిన వారు వె యిటేజీ మార్కులను తప్పు బడుతూ హై కోర్టును ఆశ్ర యించారు. దీంతో ప్రొవిజినల్ విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

● రెండు చోట్లా ప్రయోజనం...

ప్రభుత్వ వైద్య విభాగంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సేవల్లో పని చేసినవారికి పని కాలాన్ని బట్టి 20 శాతం వెయిటేజీ పాయింట్లను వైద్య ఆరోగ్యశాఖ కేటాయిస్తోంది. కొందరు అభ్యర్థులు ప్రభుత్వ దవాఖానాల్లో ఫార్మిసిస్టులుగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో సేవలు అందిస్తూనే ప్రైవేటు మెడికల్ షాపుల్లోనూ పని చేస్తూ ప్రయోజనం పొందుతున్నారు. ఈ విషయమై పరీక్షకు హాజరైన కొందరు మెరిట్ అభ్యర్థులు వైద్య ఆరోగ్యశా ఖ లో ఫిర్యాదు చేశారు. అధికారుల విచారణలో రెండు చోట్లా ప్రయోజనం పొందుతున్నట్లు రుజువు కావడంతో వారికి ప్రభుత్వం...

(తరువాయి 7లో)

పంచాయతీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి



కాంగ్రెస్ జిల్లా అధ్యక్షున్ని సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

మందమర్రిటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో త్వరలో జరిగే పంచాయతీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఈ ఎన్నికల్లో కూడా తమ పార్టీదే విజయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రఘునా థ్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా నియామకమైన సందర్భంగా రామకృష్ణాపూర్, మందమర్రికి చెందిన నాయకులు ఆదివారం ఆయనను ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం పాటు పడే వారికి పదవులు లభిస్తాయనడానికి తాను ఒక నిదర్శనమని పేర్కొన్నారు. అధిష్టానం సూచన మేరకు నూతన కమిటీల ప్రక్రియ త్వరలో మొదలవుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఏ ఎన్నికలు జరిగినా విజయం కాంగ్రెస్‌దేనని తెలిపారు. త్వరలో సీఎంను, పీసీసీ అధ్యక్షుడిని కలవనున్నట్లు తెలిపారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన మంత్రి వివేక్‌వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లె రాజు, నోముల ఉపేందర్‌గౌడ్, రమేష్, ఆకారం రమేష్, ఎండీ ఇసాక్‌,నీలం శ్రీనివాస్‌గౌడ్, ఒడ్నాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియామకమైన పి. రఘునాథ్‌రెడ్డిని ఆదివారం మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్ శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు కమల్ మనోహర్‌రావు, నాయకులు సంపత్‌రావు, సుధాకర్ పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన



ప్రజలకు వైద్య చికిత్సలు చేస్తున్న వైద్యులు

దండేపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆఫ్ మంచిర్యాల గోల్డెన్ జూబ్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. ప్రజలకు ఉచితంగా హృదయ, కంటి, దంత, స్త్రీరోగ, పిల్లల వైద్య విభాగాలతో పాటు సాధారణ వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్‌కుమార్, కార్యక్రమ చైర్‌పర్సన్ గాదె సత్యం, కార్యదర్శి ఇరుకుల్ల శివ, కోశాధికారి నరేష్‌చందర్, వైద్యులు అవని, చెన్న రాకేష్, సుగుణాకర్, రాజేష్, రాకేష్‌రెడ్డి, సుష్మా, శ్రీకర్, ఆండ్రియాలజిస్టు వేణు, అప్టోమెట్రిస్టు రాజేష్, లయన్ సత్యపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్, కర్ర లచ్చన్న, సన్‌రైజ్ స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్‌రావు, లయన్స్‌క్లబ్ దండేపల్లి అధ్యక్ష, కార్యదర్శులు కొండు జనార్ధన్, గడ్డం రామచందర్, కోశాధికారి కల్లెం రాజన్న పాల్గొన్నారు.

చిన్న నీటి వనరుల గణన
●రెండు నెలల్లో లెక్కింపు ప్రక్రియ పూర్తి..
●డిజిటల్ యాప్‌లో వివరాల నమోదు.. 7
ప్రతీ ఒక్కరు దేశభక్తి పెంపొందించుకోవాలి... 7
ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు... 7

వలస కార్మికుల మానవత్వం...

బాలుడి చికిత్సకు రూ. 50 వేల విరాళం

దండేపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దండేపల్లి మండలం గుడిరేవు గ్రామానికి చెందిన ఇజ్రాయెల్ భవన నిర్మాణ కార్మికులు మానవత్వం చాటుకున్నారు. గుడిరేవు వాసులైన జి. సురేష్, రాయశెట్టి సతీష్ చొరవతో చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నర్సాపూర్ గ్రామానికి చెందిన దొంతమల్ల నరేష్‌కు 45 రోజుల కుమారుడు అనారోగ్యంతో బాధ పడుతుండగా ఆకు టుంబానికి రూ. 50 వేల ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకు న్నారు. విదేశాల్లో కష్టపడి సంపాదిస్తున్నప్పటికీ స్వగ్రామ ప్రజల కష్టాసుఖాల్లో తోడుగా నిలవడంతో ఈ ప్రాంత ప్రజలుఏ వారిపై ప్రశంసలు కురిపిస్తున్నారు. బాలుడి చికిత్స కోసం అందించిన ఆర్థిక సహాయం కుటుంబానికి ఊరటనిచ్చింది.

ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ విజేత ఆర్‌కే 7 టీమ్



బహుమతి అందుకుంటున్న క్రీడాకారులు

శ్రీరాంపూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలకు చెందిన వసుధ హాస్పిటల్, ప్రవీణ్స్ ఆర్థో హాస్పిటల్ ఆధ్వర్యంలో క్రిష్ణకాలనీలోని శాంతి మైదానంలో ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో విజేతగా ఆర్‌కే 7 టీం నిలిచింది. ఈ పోటీల్లో మొత్తం ఆరు జట్లు పాల్గొనగా, సెమీ ఫైనల్‌లో ఆర్‌కే 7 జట్టు ఇందారం 1ఏ జట్టుపై ఒక వికెట్టు తేడాతో విజయం సాధించింది. అనంతరం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆర్‌కే 7 జట్టు, ప్రైవేట్ ఎస్ అండ్ పీసీ జట్టు పోటీ పడగా, ఆర్‌కే 7 జట్టు 6 వికెట్ల తేడాతో గెలిచింది. ఈ టోర్నమెంట్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నంరేదర్, ఫైనల్ మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ప్రసాద్ నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు.

బీసీ స్థానాలు గల్లంతు

- సర్పంచ్ పదవులకు దక్కని రిజర్వేషన్
- నెన్నెల మండలంలో బీసీ స్థానాలు నిల్
- పునః పరిశీలించాలని కోరుతున్న బీసీ నేతలు



బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీసీల ఐక్య వేదిక నాయకులు

నెన్నెల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ రిజర్వేషన్లు ఖరారయ్యాయి. సర్పంచు, వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్లను అధికారులు ఖరారు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో గతంలో ప్రకటించిన స్థానాల్లో మార్పులు జరిగాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీసీలకు 27 శాతానికి తగ్గించి మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా సర్దుబాటు చేశారు. దీంతో గత బీసీ స్థానాలను రోస్టర్ పద్ధతిన జనరల్‌గా, మహిళలకు కేటాయించారు. అయితే నూతన విధానంతో కొన్ని మండలాల్లో తమకు అన్యాయం జరిగిందని బీసీలు అంటున్నార్లు. సర్పంచ్ పదవికి నెన్నెల మండలంలోని 19 జీపీల్లో ఏ ఒక్కటి కూడా బీసీలకు దక్కక పోవడమే ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. 2019 ఎన్నికల్లో 19 జీపీల్లో నాలుగు, ముందుగా 42 శాతంతో ప్రకటించిన ప్రకారం ఏడు స్థానాలు బీసీలకు కేటాయించగా ప్రస్తుతం ఒక్కటి కూడా లేక పోవడం విడ్డూరంగా ఉందని అంటున్నారు. మండల సర్పంచుల రిజర్వేషన్లను పునః పరిశీలించాలని మండల బీసీ ఐక్య వేదిక నాయకులు బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వాస్తవ గణాంకాలు, సామాజిక న్యాయం ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని కోరుతున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని కాసిపేట మండలంలో కూడా ఇదే పరిస్థితి ఉంది. 22 స్థానాలకు గాను ఒక్కటి కూడా బీసీలకు రిజర్వు కాలేదు. వేమనపల్లి మండలంలో 14 స్థానాలకు గాను ఒకటి, బెల్లంపల్లి, కన్నెపల్లి, తాండూరు, భీమిని మండలాల్లో రెండేసీ జీపీలను మాత్రమే బీసీలకు కేటాయించారు. ప్రస్తుత స్థానాల కేటాయింపుపై బీసీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రతీ ఒక్కరు సేవా భావం కలిగి ఉండాలి



మహిళలకు కుట్టు మిషన్లను అందజేస్తున్న సభ్యులు

లక్షెట్టిపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని భగవాన్ సత్యసాయి సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పాటిబండ్ల శ్రీరామమూర్తి అన్నారు. పట్టణంలోని శ్రీనివాస గార్డెన్స్‌లో శ్రీశివ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో భగవాన్ శ్రీసత్యసాయి బాబా 100వ శత జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేసారు. ఈసందర్భంగా శ్రీరామమూర్తి మాట్లాడుతూ శ్రీసత్యసాయి జయంతి సందర్భంగా దాతల సహాయంతో సుమారు 26మందికి కుట్టు మిషన్లు అందజేసారు. నిరుపేదలకు 50 మందికి దుప్పట్లను అందించారు. ఈకార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కేవీ ప్రతాప్, వైశ్య సంఘం నాయకుడు కొత్త వెంకటేశ్వర్లు, ఐక్య వ్యాపార సంఘం అధ్యక్షుడు మైలారపు సుధాకర్, పట్టణ పురోహితులు వినోద్‌శర్మ, సంస్థ సభ్యులు సతీష్, మనోహర్, సుమతి, ప్రసన్న పాల్గొన్నారు.

ఒక్క క్లిక్‌తో మీసేవ..

- వాట్సాప్‌లో సర్వీసులు ప్రారంభం
- అందుబాటులోకి వినూత్న డిజిటల్ సేవలు

నెన్నెల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మీసేవ సర్వీసులు ప్రజలకు మరింత చేరువ అయ్యాయి. మీ సేవ సెంటర్ల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా నేరుగా వాట్సాప్ ద్వారానే సేవలు పొందేలా ప్రభుత్వం ఏ ర్పాటు చేసింది. ఈ డిజిటల్ సేవలను ఈ నెల 18 న మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఇక పైన ఒక్క క్లిక్‌తో 20కి పైగా మీసేవ సర్వీసులను పొందవచ్చు. వాట్సాప్‌లో 80969 58096 నంబరుకు హాయ్ అని మెసేజ్ చేస్తే చాలు వెంటనే రిప్లైలో మెనూ వస్తుం ది. కావాల్సిన సేవలను ఎంచుకొని దరఖాస్తు చేసు కోవచ్చు. ఎప్పటికప్పుడు అప్‌డేట్స్‌తో పాటు ఆమోదం పొందిన సర్టిఫికెట్‌ను డౌన్ లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించారు. ఈ విప్లవాత్మక మార్పులతో ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత సులభంగా వేగంగా అందుతాయని అధికారులంటున్నారు.

● అప్లై.. డౌన్‌లోడ్

అధికారిక నంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మె సేజ్ చేస్తే నమస్కారం.. తెలంగాణ మీసేవకు స్వాగతం.. మీకు ఎలాంటి సేవలు కావాలంటూ రిప్లై వస్తుంది. అందుబాటులో ఉన్న సర్వీసుల మెనూ వస్తుంది. అందులో దరఖాస్తును ఎంచుకోవాలి. దర ఖా స్తును పూరించి అవసరమైన డాకుమెంట్లు, ఫొటోలు స్కాన్ చేయాల్సి ఉంటుంది. సూచించిన ఫీజును యూపీఐ ద్వారా సురక్షితంగా చెల్లించవచ్చు. ఆ తర్వా త దరఖాస్తు స్టేటస్, అప్‌డేట్స్, అన్ని వాట్సాప్ లోనే మెసేజ్ రూపంలో వ స్తాయి. ఆన్‌లైన్‌లో అందిన దర ఖాస్తు పరిశీలించిన అధికారులు ధృవీకరణ పత్రాలను డోంగల్ ద్వారా జారీ చేస్తారు. సర్టిఫికెట్ సిద్ధం కాగానే దాని డౌన్ లోడ్ లింక్ ఫోన్‌కే వస్తుంది. దాన్ని క్లిక్ చేసి డౌన్‌లోడ్ చేసుకొని పీడీఎఫ్ రూపంలో సేవ్ చేసుకోవచ్చు. అవసరమైతే ప్రింట్ తీసుకొని వాడుకోవచ్చు.



● అందుబాటులో ఉండే సేవలు ఇవే...

ప్రస్తుతం 20కి పైగా సేవలను వాట్సప్ ద్వారా అం దుబాటులో ఉన్నాయి. మరిన్ని సేవలను చేర్చే పని లో అధికారులు ఉన్నారు. ఇక ఫోన్ ద్వారానే ఆదా యం, నివాస ధృవీకరణ పత్రం, బర్త్, డెత్ సర్టిఫికెట్స్ కు దరఖాస్తు చేసుకొని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. నల్లా, కరెంటు బిల్లులు, పోలీస్ చలాన్స్, ఆర్టీఏ లైఫ్ టాక్స్ చెల్లించవచ్చు. ఇళ్ల నిర్మాణాలకు గ్రామ పంచాయతీ ఇళ్ల పర్మిషన్లు, పంచాయతీల్లో, మున్సిపాలిటీల్లో మ్యూ టేషన్ దరఖాస్తులు, ఆస్తి పన్నులు చెల్లించుకోవచ్చు. దేవాలయాల సమాచారం, దైవ దర్శనాల స్లాట్ బు కింగ్, గదుల బుకింగ్, ఆన్‌లైన్ పూజా బుకింగ్ సౌల భ్యం కూడా ఉంది. రేషన్ కార్డుల జారీ, రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్, వ్యవసాయ మార్కెట్ ధరలు ఇలా పలు రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి.